క్లుప్తంగా

వలసల నివారణకే 'ఉపాధి' పనులు



పాతబగ్గాంలో ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఓ రామారావు

గజపతినగరం రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి నగరాలకు పోతున్న వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం పనులు చేయిస్తున్నాయని ఏపీఓ చప్ప రామారావు తెలిపారు. మండలంలోని పాత బగ్గాం, మరుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేస్తూ వంద రోజుల పనిదినాలు కల్పించడం జరుగుతోందన్నారు. ప్రధానంగా వలస బాట పడుతున్న ఎస్సీ, ఎస్టీలకు శతశాతం జాబ్‌కార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు.

క్లాస్ ప్రోగ్రాం ప్రారంభం



క్లాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్లాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీపీ పీరుబండి హైమావతి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏ గ్రామంలో నైనా మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లు ఉంటే వాటిని బాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వి.నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.జైహింద్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రెల్లి అప్పల నాయుడు (ఫైల్)

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలసకు చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు రెల్లి అప్పలనాయుడు(60) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఏదో పని నిమిత్తం మండలంలోని విశ్వనాథపురం వెళ్లి, తిరిగి బైకుపై స్వగ్రామం వస్తుండగా, గుండెపోటు రావడంతో కిందపడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం హుటాహుటిన విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన మృతికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుర్ల: దివ్యాంగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. మండలంలోని గుర్ల గ్రామంలో ఇద్దరు దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన వీల్‌చైర్లు శుక్రవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ వాహనాలు, పరికరాలు, నెలనెలా పెన్షన్ కూడా అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, ఎంపీడీఓ కల్యాణి, పార్టీ నాయకులు పి.సన్యాసినాయుడు, బి.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వల్లంపూడిలో 'జగనన్నే మా భవిష్యత్'



వల్లంపూడిలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ లక్ష్మి

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు శానాపతి లక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఇంటి యజమాని అనుమతి మేరకు గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తమటాడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల బాగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆయన అనేక పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఇంటికి మేలు చేకూరేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదని గ్రామాల్లోని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే పథకం మంజూరవుతోందన్నారు. గ్రామసచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బి.వి.ప్రభాజీ, ఎఎంసీ చైర్మన్ వి.ముత్యాలునాయుడు, ఎంపీపీ సీహెచ్ చలంనాయుడు, జెడ్పీటీసీ ఆర్. సూర్యప్రకాశరావు, ముద్దురు గ్రామ సర్పంచ్ ఎం.పైడినాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.కృష్ణవేణి, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్‌లతో శుక్రవారం సమావేశమైన ఆమె విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా ఇప్పటికే ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పాఠశాలలు, కళాశాలలను రూపొందించారన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా జగనన్న గోరుముద్ద పథకం అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం పని ప్రభుత్వం చేసోందని, మీ వంతుగా మీరు పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కోరారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, వారి విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వి.నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.జైహింద్ కుమార్, ఎంఈఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బానోజీరావు పాల్గొన్నారు.

భూ పట్టాలు ఇవ్వండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు సూర్యనారాయణ

వేపాడ: గిరిజనులకు భూ పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు తమ్మినేని సూర్యనారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు కోరారు. ఇదే విషయమై వారు మండలంలోని కొండగంగుబూడి గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆరు గ్రామాల గిరిజనులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. ఎవరెవరు ఎంత భూమి సాగు చేస్తున్నారని గతంలో అధికారులు వివరాలు సేకరించారని, అయితే ఇంతవరకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలు గిరిజనులు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటినా అధికారులు చొరవ తీసుకుని, పట్టాలు ఇచ్చే కార్యక్రమం వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్–1లో దాదాపు 276 కొండ పోరంబోకు భూమిలో 160 మంది సాగు చేస్తున్నారని గుర్తించామన్నారు. వీరందరికీ పట్టాలు ఇచ్చేందుకు జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం పొందాల్సి ఉందని, అందువల్లే జాప్యం జరుగుతోందని వివరించారు.

సచివాలయాల్లో ఈ-సర్వీసులు పెంచండి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నిర్మలాదేవి

బొండపల్లి: సచివాలయాల్లో ఈ–సర్వీసు సేవలను పెంచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ జి.నిర్మలాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన జరిగిన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ల సమావేశానికి హాజరైన ఆమె పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ–సర్వీసుల్లో గొల్లుపాలెం సచివాలయం, ధ్రువీకరణపత్రాలు అందజేయడంలో దేవుపల్లి సచివాలయం, ఆధార్ అనుసంధానం, అప్‌డేషన్‌లో బొండపల్లి సచివాలయం ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది సక్రమంగా పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలని కోరారు. తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

వేపాడ: బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ కె.ఎస్.ఆర్.వి.పట్నాయక్ సూచించారు. మండలంలోని వావిలపాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం ద్వారా వస్తున్న అర్జీలపై ఆరాతీశారు. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని పలువీధుల్లో తిరుగాడిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను గమనించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటించండి.. రోగాలకు దూరంగా ఉండండి..



దోమ లార్వాలు లేకుండా కాలువల్లో స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని అఫీషియల్ కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒక్కరోజు(ప్రతీ శుక్రవారం) డ్రైడే పాటించి, రోగాలకు దూరంగా ఉండాలని కోరారు. డ్రమ్ములు, ట్యాంకులు, టైర్లు, కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం కాలువల్లో దోమ లార్వాలు పెరగకుండా సిబ్బంది మందు స్ప్రే చేయించారు. అలాగే ఫీవర్ సర్వే చేసి, జ్వరాల బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమతెరాలు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.కోట సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.నందయ్య, పి.రాజశేఖర్, టి.శంకరరావు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఐసీడీఎస్ పీఓ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

గజపతినగరం: తమకు గ్రాట్యుటీ ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరుతున్నారు. ఇదే విషయమై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మితో కలిసి స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ నాగమణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం–1972 ప్రకారం అర్హులైన తమకు గ్రాట్యుటీ చెల్లించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, పెన్షన్‌తో కూడిన రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.జ్యోతి, రాములమ్మ, సన్యాసమ్మ, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే దుష్ప్రచారం

- జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా దుష్ప్రచారానికి ఒడిగట్టాయని జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలంలోని కోడూరు గ్రామంలో శుక్రవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, దానికోసం ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ఆయన అందిస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, ఎంఈఓ పి.రామారావు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

శృంగవరపుకోట: స్థానిక గాంధీ పార్కులో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ అధ్యక్షతన పాడిరైతుల రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో పాడిరైతులకు ఇసానన్న బోనస్ ఇవ్వాలని కోరారు. సహకార చట్టం–1964 ప్రకారం డెయిరీలు నడపాలని, లీటరు పాలకు రూ.4 బోనస్ ఇవ్వాలని, అలాగే ప్రతీ లీటరు పాలకు డెయిరీలు రైతులకు రూ.10 చెల్లించాలని, అలాగే 70 శాతం రాయితీపై పశుదాణా ఇవ్వాలని, పాడిపశువుల కొనుగోళ్లకు బ్యాంక్ రుణం మంజూరు చేయాలని, పాడి ఉత్పత్తులపై జీఎస్‌టీ రద్దు చేయాలని, ప్రతీ జిల్లాలో బ్రీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, మేలుజాతి పశువులను ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సమావేశంలో ఏపీ పాలరైతుల సంఘం అధ్యక్షుడు బి.రాంబాబు, జీడి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జె.గౌరీష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'రాజభాష'తో ఉజ్వల భవిష్యత్



సర్టిఫికెట్లతో గరివిడి కేజీబీవీ విద్యార్థినులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాజభాష హిందీతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గరివిడి కేజీబీవీ ప్రత్యేకాధికారి ఐ.ధనలక్ష్మి, హిందీ ప్రచారకులు బెవర అప్పలస్వామి అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశ, విశారద ఉత్తరార్థ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 36 మంది కేజీబీవీ విద్యార్థినులకు గరివిడి కేజీబీవీలో శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. హిందీ భాషలో పట్టు సాధిస్తే ఆ సబ్జెక్ట్ టీచర్‌గా స్థిరపడొచ్చని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయిని షేక్ రేష్మాబేబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి 'ఫ్యామిలీ డాక్టర్' భరోసా



రోగుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యురాలు నిరోషా



గుర్ల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గజపతినగరం రూరల్: ప్రజారోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం భరోసా ఇస్తోందని మరుపల్లి పీహెచ్‌సీ అదనపు వైద్యురాలు నిరోషా అన్నారు. శుక్రవారం మండలంలోని లోగిశ గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యసేవలందించారు. ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గుర్ల: మండలంలోని మణ్యాపురిపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు, వాహనాన్ని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైద్యాధికారి షర్మిలి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, సర్పంచ్ బి.హైమావతి పాల్గొన్నారు.

అవయవదానం చేసి, మానవత్వం చాటుకోండి



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): అవయవదానం చేసి, మానవత్వం చాటుకోవాలని మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు కోరారు. గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట నేత్ర, అవయవదానంపై వేతనదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మరణానంతరం చేసే అవయవ దానం మరొకరికి జీవితంలో వెలుగులు నింపుతుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రక్తదానంపై కూడా జనాలకు చాలా అపోహలు ఉన్నాయని, వాటికి కూడా విడనాడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం వల్ల ఆరోగ్యమే తప్ప అనారోగ్యం ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో రోడ్డు విస్తరణ పనులు



జేసీబీతో రోడ్డు పక్కనున్న పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: కోమటిపల్లి–దత్తిరాజేరు బీటీ రోడ్డు నుంచి వింధ్యావాసి గ్రామానికి వెళ్లే తారురోడ్డు విస్తరణకు రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు పీఆర్ జేఈ అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం 12 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 24 అడుగుల మేర 300 మీటర్ల వరకు విస్తరిస్తామన్నారు. రెండు, మూడు రోజుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, పిచ్చిమొక్కలు తొలగించే పనులు పూర్తి చేస్తామని సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు.

మే 1 నుంచి శ్యామలాంబ జాతర మహోత్సవాలు



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు గ్రామంలో మే 1వ తేదీ నుంచి శ్యామలాంబ జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో జాతర ఏర్పాట్లపై గ్రామ సచివాలయంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు, సచివాలయ ఉద్యోగులు శుక్రవారం సమావేశమై, చర్చించారు. మూడు రోజుల పాటు జరిగే జాతరలో ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కల్యాణి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, ఎస్ఐ హరిబాబునాయుడు, సర్పంచ్ ఎం.ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

దత్తిరాజేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓలు ఎం.సత్యవతి, వెంకటప్పలనాయుడు అధ్యక్షతన ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. అంబుడ్స్‌మన్ కమిటీ సభ్యురాలు జి.అన్నపూర్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంతో పేదలకు జీవనోపాధి దొరికిందన్నారు. వంద రోజుల పనిదినాలను చక్కగా వినియోగించుకుని, స్వగ్రామంలోనే ఉపాధి పొందాలని కోరారు. అంతకుముందు 2021–22 ఆర్థిక సంవత్సరంలో 35 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనుల వివరాలను ఏపీడీ శారద చదివి వినిపించారు. గొబ్యాం, దత్తి, టి.భూర్జవలస, రామచంద్రాపురం, షికారుగంజి సరయ్యవలస, దత్తిరాజేరు, చుక్కపేట, గుచ్చిమి గ్రామాల్లో గతంలో నాటిన మొక్కలు లేవని, వాటి స్థానంలో కొత్త వాటిని నాటి సంరక్షించాలని క్షేత్రసహాయకులను అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీడీ రవీంద్ర, వైస్ ఎంపీపీ బి.అప్పలనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడాశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు షటిల్ బాడ్మింటన్ కోచ్ పి.శ్రీరాములు శుక్రవారం తెలిపారు. 8 నుంచి 15 సంవత్సరాలలోపు వయసున్న బాలబాలికలంతా శిక్షణ శిబిరానికి వచ్చి, షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందాలని కోరారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు కూడా ఉంటాయన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

- ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ అనూష రెడ్డి

భోగాపురం: అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసేందుకు మే 3వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆమె కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి దాదాపు 15 వేల మంది సభకు హాజరుకానున్నారని, ఈ నేపథ్యంలో దానికి తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలని ఆమె సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.బంగారయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యు.సూర్యనారాయణ రెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద ధర్నా

- శస్త్రచికిత్స సరిగా చేయలేదంటూ ఆందోళన



గజపతినగరంలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోమ్ వద్ద ధర్నా చేస్తున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

గజపతినగరం: ప్రసవ సమయంలో శస్త్రచికిత్స సరిగా చేయకపోవడం వల్లే శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ అయిందంటూ మరుపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి కరుణ, ఆమె తల్లి ఉత్తరావల్లి సుగుణ, కుటుంబ సభ్యులు శుక్రవారం గజపతినగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... మరుపల్లికి చెందిన గర్భిణి చింతపల్లి కరుణ మూడో డెలివరీ కోసం గజపతినగరంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేరారు. ఉగాది రోజున ఆస్పత్రి వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స చేసి పురుడుపోశారు. తల్లీబిడ్డలు కోలుకున్నాక ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే, కొద్దిరోజులకే కరుణ ఆరోగ్యం క్షీణించడం, హెచ్‌బీ శాతం తగ్గడంతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రసవ సయమంలో శస్త్రచికిత్స సరిగా చేయకపోవడమే అనారోగ్యానికి ప్రధాన కారణమని అక్కడి వైద్యులు చెప్పడంతో కరుణతో పాటు కుటుంబ సభ్యులు గజపతినగరానికి చేరుకుని ఆందోళన చేశారు. న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని కూర్చున్నారు. దీనిపై ఆస్పత్రి వైద్యురాలు స్పందిస్తూ గర్భిణికి సక్రమంగానే శస్త్రచికిత్స చేశానన్నారు. గర్భిణి భర్త పైడిపునాయుడు నా ఆస్పత్రిలో పనిచేస్తున్నారన్న ఉద్దేశంతో రిస్క్‌చేసి ఆయన అంగీకారంతోనే పురుడుపోశానని స్పష్టం చేశారు. లేనిపోని నిందలు మోపడం సరికాదన్నారు. కావాలంటే బాధితురాలి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య సేవలు అందిస్తానని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.